శుక్రవారం 02-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 412 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


## అక్కలను అడ్డుపెట్టుకొని రాజకీయం

### అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



ముందడుగు తెలంగాణ:

తెలంగాణలో బిఆర్ఎస్ రాజకీయ పాచికతో సభను స్తంభింపజేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అక్కలను అడ్డంపెట్టుకుని ఆ పార్టీ రాజకీయం చేస్తోందన్నారు.

"సబిత, సునీతను సొంత అక్కలుగానే భావించా. ఒక అక్క నన్ను నడిబజారులో వదిలేసినా ఏం అనలేదు. ఇంకొక అక్క కోసం ఎన్నికల ప్రచారానికి వెళ్లాను. అప్పటి కేసుల్లో ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాను. నా ప్రచారానికి వచ్చిన తమ్ముడిపై కేసులు ఎత్తివేయాలని ఎప్పుడైనా చెప్పారా?నన్ను నమ్ముకున్న అక్కలు మంత్రులై ముందువరుసలో ఉన్నారు. ఆ తమ్ముడిని నమ్ముకున్న అక్కల పరిస్థితి ఎలా ఉందో అందరూ చూస్తున్నారు. మీరు నమ్ముకున్న వ్యక్తి సొంత చెల్లెలే తిహాడ్ జైలులో ఉన్నారు" అని రేవంత్ వ్యాఖ్యానించారు.



## దేశంలోనే భయంకరమైన విషాద ఘటన

- ఏ విధంగా ఓదార్చాలో తెలియడం లేదు
- వయనాడ్ సందర్శించిన రాహుల్ గాంధీ

ముందడుగు కేరళ:

కేరళలో సంభవించిన ప్రకృతి విపత్తు బాధితులను పరామర్శించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ వయనాడ్‌ను సందర్శించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పర్యటించారు. ఆయనతో పాటు ప్రియాంక గాంధీ వెళ్లారు. అక్కడ నెలకొన్న పరిస్థితి చూసి ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. "దేశంలోనే అత్యంత భయంకరమైన విషాద ఘటన వయనాడ్‌లో చోటు చేసుకొంది. ప్రజలు తమ ఇళ్లు, కుటుంబ సభ్యులను కోల్పోవడం బాధాకరం. ఇలాంటి సమయంలో వారిని ఏ విధంగా ఓదార్చాలో తెలియడం లేదు. నా తండ్రి (రాజీవ్ గాంధీ) చనిపోయినప్పుడు ఎలా బాధపడ్డానో.. ఈరోజు అలాగే అనిపిస్తోంది" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

నా దృష్టిలో ఇది జాతీయ విపత్తు. ఈ ఘటనలో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. కేరళకు జరిగిన నష్టం దేశానికి తీరని విషాదం. ఇది రాజకీయాలకు సమయం కాదు.. బాధితులందరికీ అవసరమైన సాయం అందించడానికే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి బాధితులకు రావాల్సిన సాయం అందేవరకు కాంగ్రెస్ పోరాడుతుంది. ఇలాంటి విపత్తులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దీనిపై సమగ్ర కార్యచరణ ప్రణాళిక అవసరం" అని రాహుల్ పేర్కొన్నారు.




ఉత్తరాఖండ్‌ను ముంచెత్తుతున్న **భారీ వర్షాలు**

మిగతా 2లో




నిమిషానికి గూగుల్ ఆదాయం రూ.2 కోట్లు

మిగతా 3లో



ఒక రాష్ట్రంలో ప్రవహిస్తున్న 48 నదులు

మిగతా 4లో




బిగ్ బాస్ హౌస్‌లోకి విష్ణు ప్రియ, రీతూ చౌదరి.?

మిగతా 5లో

## 48 గంటల్లోనే నాలుగు అత్యాచారాలు

**8 నెలలు అవుతున్నా హోం మంత్రి లేరు, ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం**

ముందడుగు తెలంగాణ:



తెలంగాణ రాష్ట్రంలోని అత్యాచార ఘటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## శవాలను చూసి పారిపోవాలనుకున్నాను

- మృతదేహాలను చూసి వణుకుతున్న వైద్యులు
- వయనాడ్ ఘటనపై ఓ వైద్యుడి ఆవేదన

వివరాలు 2లో

ముందడుగు
శుక్రవారం, 02-08-2024, హైదరాబాద్

## 48 గంటల్లోనే నాలుగు అత్యాచారాలు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా రాష్ట్రానికి హోం మంత్రి లేకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలను తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కేవలం 48 గంటల్లోనే నాలుగు చోట్ల సామూహిక అత్యాచారాలు చోటు చేసుకోవడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. మహిళలకు భద్రత లేకపోవడం కారణంగానే ఈ క్రూరమైన చర్యలకు దుండగులు పాల్పడుతున్నారు. ఈ వరుస ఘటనలు రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలను ఎత్తి చూపిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ, ఒక హోం మంత్రి లేకపోవడం దారుణం. హోంమంత్రి లేకపోవడం కారణంగా నేరాల సంఖ్య పెరిగిపోతుందన్నారు. వనస్థలిపురం, శాలిగౌరారం, నిర్మల్, పుప్పాలగూడలో జరిగిన ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

## ఉత్తరాఖండ్‌ను ముంచెత్తుతున్న భారీ వర్షాలు

- కేదార్‌నాథ్‌లో 10 మంది ప్రాణాలు మృతి
- చార్‌ధామ్ రిజిస్ట్రేషన్లను తాత్కాలిక నిలిపివేత

ముందడుగు ఉత్తరాఖండ్:



ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని భారీ వర్షా లు ముంచెత్తుతున్నాయి. నదులన్నీ ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఇళ్లు కూలిపోయాయి. వర్షం కారణంగా కేదార్‌నాథ్‌లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. డెహ్రాడూన్, హల్ద్వానీ, చమోలి జిల్లాల్లో నలుగురు గల్లంతయ్యారు. డెహ్రాడూన్‌లో పరిస్థితులు భయానకంగా మారాయి. పలుచోట్ల ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హరిద్వార్ ప్రాంతంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కన్‌ఖాల్ పోలీస్‌స్టేషన్ నీట మునిగింది. భూపత్వాలా, హరిద్వార్, నయా హరిద్వార్, కన్‌ఖాల్, జవల్‌పూర్ ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగాయి. భారీ వర్షా ల కారణంగా కేదార్‌నాథ్ మార్గంలోని భింబలి చౌకి ప్రాంతంలో కాలిబాట కొట్టుకుపోయిందని పర్యావరణ విపత్తు ప్రతిస్పందన శాఖ కార్యదర్శి వినోద్ కుమార్ వెల్లడించారు. మరోవైపు కొండ ప్రాంతాల్లో రాళ్లు కూలిపోతున్న కారణంగా కేదార్‌నాథ్‌కు వెళ్లే 200 మంది ప్రయాణికులను నిలిపివేసినట్లు చెప్పారు. మార్గమధ్యంలో ఉన్న వారిని హెలికాప్టర్‌సాయంతో వెనక్కి తీసుకొచ్చినట్లు తెలిపారు. రోడ్లమరమ్మతులు పూర్తయ్యే వరకు యాత్రికులు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని కోరారు. మరోవైపు చార్‌ధామ్ యాత్ర కోసం నూతన రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు.

## శవాలను చూసి పారిపోవాలనుకున్నాను

ముందడుగు కేరళ:

వయనాడ్‌లో శిథిలాలను తీస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే 200లకు పైగా దేహాలను బయటకు తీసినట్లు సమాచారం. దారుణ స్థితిలో ఉన్న వాటిని చూసి వైద్యులు కూడా వణికిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడి హృదయవిదారక పరిస్థితులతో కలత చెందుతున్నట్లు శవపరీక్షలు చేస్తోన్న వైద్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో ఛిద్రమైన మృతదేహాలకు పోస్టుమార్టం చేయలేక పారిపోవాలనుకున్నట్లు ఓ ప్రభుత్వ వైద్యురాలు చెప్పడం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. "ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉన్నా. ఎన్నో మృతదేహాలకు పోస్టుమార్టం చేశా. ఇక్కడ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఓ శరీరం చూస్తే మొత్తం ఛిద్రమయ్యింది. రెండోదాన్ని చూడలేకపోయా. అది కూడా ఏడాది చిన్నారిది. అటువంటి మృతదేహాలు వరుసగా వస్తూనే ఉన్నాయి. అందులో అనేకం గుర్తించలేనంతగా ఉండటం కలచివేసింది. ఇక పోస్టుమార్టం చేయలేనని అనుకున్నా. ఆ ప్రాంగణం నుంచి బాధితుల సంరక్షణ కేంద్రానికి పారిపోదామనుకున్నా. కానీ, ప్రత్యామ్నాయం లేదు. అలా మొత్తంగా 18 మృతదేహాలకు శవపరీక్ష నిర్వహించా" అని వయనాడ్ ఘటన ప్రదేశంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ వైద్యురాలు భావోద్వేగంతో వివరించారు.

## రాహుల్ కుట్టిన బూట్లకు భారీ డిమాండ్

### లక్షల రూపాయలు ఆఫర్ చేస్తున్న వ్యక్తులు

ముందడుగు జాతీయం:



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ శివారులోని విధాయక్ నగర్‌లోని ఓ చెప్పుల దుకాణానికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయనతో చాలా సేపు మాట్లాడారు. ఆయన చెబుతుంటే ఓ 'షూ' కూడా కుట్టారు. దీంతో రామ్ చేత్ ఇమేజ్ ఒక్కసారిగా మారిపోయింది. అటువైపుగా వెళ్తున్న వారంతా కారు ఆపి మరీ, ఆయన యోగక్షేమాలు అడుగుతున్నారు. సెల్ఫీలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. మరోవైపు రాహుల్ కుట్టిన 'షూ'కి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఆయన వెళ్లిన వెంటనే ఒకరు ఫోన్ చేసి.. దానిని రూ.5 లక్షలకు విక్రయించాల్సిందిగా కోరారట. ఇంకొకరు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పారట. మరొకరైతే.. 'బ్యాగు నిండా డబ్బిస్తా.. ఇచ్చేయ్' అన్నారట. అయితే, దానిని విక్రయించబోనని, రాహుల్‌కి గుర్తుగా తన వద్దే ఉంచుకుంటానని రామ్ చేత్ చెబుతున్నారు. మరోవైపు రాహుల్‌తో దిగిన ఫొటో వార్తాపత్రికల్లో వచ్చినప్పటి నుంచి అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఏమైనా సమస్యలుంటే చెప్పాలని స్థానిక అధికారులు వచ్చినట్లు ఆయన చెప్పారు. రాహుల్ ఆదేశాల మేరకు.. ఆ తర్వాతి రోజునే పార్టీ నేతలు రూ.10 లక్షల విలువైన చెప్పులు కుట్టే మిషన్‌ను ఆయనకు అందజేశారు. అయితే, తన ఇంటికి కరెంట్ సదుపాయం లేకపోవడంతో, కుమారుడి ఇంటి వద్ద పెట్టి చెప్పులు కుడుతున్నానని రామ్ చేత్ చెప్పుకొచ్చారు.

## వృద్ధురాలిపై కిరాతకంగా కుక్కలు దాడి

### తల, కడుపు భాగం పూర్తిగా తినేసాయి

ముందడుగు రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాలో పిట్ల రాజ్యలక్ష్మి (75) అనే వృద్ధురాలిపై కుక్కలు అత్యంత కిరాతకంగా దాడి చేశాయి. కుక్కలు రాజ్యలక్ష్మి తల, కడుపు భాగం పూర్తిగా తినేసాయి. కుక్కలు రాత్రి దాడి చేసి చంపగా... ఆమె కొడుకులు తెల్లవారి ఉదయం 9గంటలకు చూశారు. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నట్లు సమాచారం. ఇంటికి తలుపులు లేకపోవడంతో దాడి చేసి ఉండవచ్చని గ్రామస్తులు అంటున్నారు. వృద్ధురాలిపై దాడి చేసిన కుక్కను గ్రామస్తులు చంపేశారు. గతంలో



చిన్నపిల్లలపై కూడా కుక్కలు దాడి చేశాయని, కుక్కలా బెడద నుండి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కొత్త శిఖరాలకు చేరుకున్న వెర్సుని ఇండియా వారి ప్రీతి జోడియాక్




ముందడుగు హైదరాబాద్:
ఇండియా, వెర్సుని ఇండియా హౌస్‌కు చెందిన ప్రముఖ మిక్సర్ గ్రైండర్ బ్రాండ్ ప్రీతి కిచెన్ అప్లయెన్సెస్, నేడు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో దాని ఫ్లాగ్‌షిప్ మరియు పవర్-ప్యాక్డ్ మిక్సర్ గ్రైండర్ పేరును నమోదు చేసుకుంది. ప్రీతి జోడియాక్కు ఇది ఒక సరికొత్త మైలురాయి. ధృఢమైన పదార్థాలను గ్రైండ్ చేయగల అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్‌గా గుర్తింపుతో పాటు ఆవిష్కరణ, నాణ్యత మరియు పనితీరు పట్ల ప్రీతి అంకితభావానికి ఈ గుర్తింపు నిదర్శనం. ఈ విజయం గురించి వెర్సుని ఇండియా హోమ్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుల్బహర్ తౌరానీ మాట్లాడుతూ, "ప్రీతిలో, వినియోగదారుల పట్ల మా నిబద్ధత మాకే కాకుండా, మొత్తం వర్గానికి పరిపూర్ణతతో కూడిన కొలమానాన్ని నెలకొల్పేలా చేసింది. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్‌గా గుర్తింపు పొందినందుకు మేము ఎంతో గర్విస్తున్నాము" అన్నారు.





# పొలంబాటలో విద్యుత్ అధికారులు

## రైతుల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం ▪ వినూత్న కార్యక్రమంలో ఎన్పిడిసిఎల్

ములుగు ముందడుగు:
పొలాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట పట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వయంగా ఎన్పిడిసిఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండల కేంద్ర పరిధిలోని లక్ష్మీపురం వద్ద పొలాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, విద్యుత్ ప్రమాదాలకు కారణమయ్యే అంశాలు సిబ్బంది దృష్టి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. రైతుల వద్ద స్థానిక విద్యుత్ అధికారుల పనితీరు గురించి అడిగి తెలుసుకొని, విద్యుత్ సిబ్బందినీ అభినందించారు. మోటార్స్ దగ్గర ఏర్పాటు చేసే కెపాసిటర్స్ యొక్క ఉపయోగాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ మన్సూర్ నాయక్, ములుగు డిఈ నాగేశ్వర్ రావు, భూపాల్ పల్లి డిఈ సదానందం, ఏడిఈలు స్వామి రెడ్డి, సందీప్ పాటిల్, వెంకటాపూర్ ఏఈ సురేష్, ఏఈ వేణుగోపాల్, సబ్ ఇంజనీర్ సాంబరాజు, ఎస్ఎల్ఐ ఉదయ్ భాస్కర్, ఎల్ ఐ సమ్మిరెడ్డి, ఎల్ఎం వేణు, జేఎల్ఎం లు రాజు, లక్ష్మణ్ రావు, హెల్పర్ గాలి రాజు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎండికి రైతుల ఘన సన్మానం

రైతులకు మెరుగైన,నాణ్యమైన సేవలు అందించేందుకు,రైతుల సమస్యల్ని గుర్తించి విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎన్పీడీసీఎల్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి నీ రైతులు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

## ములుగు డిఎస్పీ రవీందర్



ముందడుగు ములుగు :
యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడుచుకోనీ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే విధంగా ఉండాలని ములుగు డిఎస్పీ రవీందర్ అన్నారు.యువత చెడు మార్గం వైపు పయనించకుండా ఉండేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ములుగు ఎస్పీ శభరీష్ ఆదేశాల మేరకు పోలీసులు వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం మండలస్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ములుగు డిఎస్పీ రవీందర్ ముఖ్యతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యువతనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ శంకర్,వెంకటాపూర్ ఎస్ ఐ జక్కుల సతీష్, క్రీడాకారులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిమిషానికి గూగుల్ ఆదాయం రూ.2 కోట్లు

## గూగుల్‌కు ఆదాయం ఏలా వస్తుందో చూడండి

ముందడుగు ప్రత్యేకం:
ఇప్పుడు మనిషి ప్రతి విషయానికి గూగుల్‌పై ఆధారపడుతున్నాడు. మనిషిని తనపై పూర్తిగా ఆధారపడేలా చేసుకుంది. గూగుల్ నుంచి సెర్చింజన్‌తో పాటు మ్యాప్స్ ఉన్నాయి.. యూట్యూబ్ ఉంది.. ఇలా ఏది అందిస్తున్నా అంతా ఉచితమే. ఉచిత పరిమితి దాటిన తర్వాత ప్రీమియం సేవలు పొందాలంటే డబ్బులు చెల్లించాలి. ఇలా ఆ కంపెనీ ఆదాయం భారీగా ఉంటుంది. అన్ని సేవలు ఉచితంగానే ఇస్తున్నప్పటికీ భారీగా డబ్బును సంపాదించడం ఎలా సాధ్యపడుతుందనే విషయాన్ని తెలుసుకుందాం. ఈ కంపెనీ ఏ ప్రాజెక్టు చేపట్టినా అది భారీ విజయం సాధించడమేకాదు.. లక్షల కోట్లరూపాయల ఆదాయాన్ని తెచ్చుకుంటోంది.

### ప్లేస్టోర్ నుంచి భారీ ఆదాయం

గూగుల్ ఒక దశ వరకు అన్ని సేవలు ఉచితంగా అందిస్తుంటుంది. పరిమితి దాటిని తర్వాత సేవలను పొందాలనుకుంటే మనం తిరిగి డబ్బులు చెల్లించాలి. మనకుండే జీమెయిల్ ఖాతాల్లో 15జీబీ డేటా ఉచితంగా ఇస్తుంది. అంతకుమించి కావాలంటే డబ్బులు చెల్లించాలి.

అలా ఆదాయం వస్తుంటుంది. మొబైల్ కంపెనీలు తాము తయారుచేసే ఫోన్లలో గూగుల్ యాప్స్ ను ఇన్ బిల్ట్, డీఫాల్ట్ గా ఉంచేందుకు ఈ కంపెనీలన్నీ గూగుల్ కు డబ్బులు చెల్లిస్తాయి. అలా యాప్స్ ద్వారా భారీగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. గూగుల్ ప్లేస్టోర్ ఉపయోగించాలన్నా కంపెనీలు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. గూగుల్ యాప్స్ అన్నీ ఒకేచోట పొందేందుకు గూగుల్ ప్లేస్టోర్ ఉంది. ఇందులో కోట్ల సంఖ్యలో యాప్స్ ఉంటాయి. వీటిద్వారా కూడా గూగుల్ కంపెనీ భారీగా లాభాలను ఆర్జిస్తోంది. ఒక నివేదిక ప్రకారం గూగుల్ కంపెనీ నిముషానికి రూ.2 కోట్లు సంపాదిస్తోంది.




### కోట్ల లింకులతో రూ.కోట్ల ఆదాయం

గూగుల్‌కు ఆదాయం వాణిజ్య ప్రకటనల ద్వారా వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లమంది అనేక రకాల విషయాలను తెలుసుకోవడానికి గూగుల్‌లో శోధిస్తుంటారు. గూగుల్‌లో ఏదైనా సెర్చ్ చేసినప్పుడు అక్కడ రెండు లింక్స్ వస్తాయి. వాటి నుంచి మరో మూడు లింకులు ఇతర లింకులకు వస్తాయి. ఇలా ప్రజలు గూగుల్‌లో ఎన్నిసార్లు అన్ని కోట్లసార్లు ఆదాయం వస్తుంది. వీటికి తోడు యూట్యూబ్‌లో కోట్లరూపాయల ఆదాయం కోట్ల సంఖ్యలో వచ్చే వాణిజ్య ప్రకటనల ద్వారా వస్తుంది.

ముందడుగు
శుక్రవారం, 02-08-2024, హైదరాబాద్

# ఒలింపిక్స్‌లో కాంస్యం..

## స్వప్నిల్ కుశాల్‌కు అభినందనలు తెలిపిన పవన్ కల్యాణ్






అమరావతి : పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన షూటర్ స్వప్నిల్ కుశాల్ (Swapnil Kushal) కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (Pawan Kalyan) అభినందనలు తెలిపారు. మన దేశానికి మరో పతకం దక్కడం సంతోషాన్ని కలిగించిందని సోషల్ మీడియా వేదిక ద్వారా స్పందించారు. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో కాంస్యం సాధించిన యువ షూటర్ స్వప్నిల్ కుశాల్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ ఒలింపిక్స్ లో మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే ఏయిర్ పిస్టోల్ విభాగంలో మను బాకర్, సౌరబ్‌జిత్ సింగ్ రెండు పతకాలు సాధించిన విషయం తెలిసిందే.



# శ్రీశైలం డ్యామ్‌కు భారీగా వరద..

## పర్యాటకులతో సందడిగా మారిన ఘాట్‌రోడ్లు..!

శ్రీశైలం : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద భారీగా పెరుగుతున్నది. గంట గంటకు వరద ఉధృతి మరింత పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు పది గేట్లను 15 అడుగుల వరకు ఎత్తి 3,76,670 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. దాంతో వరద నాగార్జున సాగర్ వైపు వెళ్తున్నది. జూరాలా, సుంకేశుల జలాశయాల నుంచి డ్యామ్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3,95,162 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో 4,36,902 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు.. ప్రస్తుతం జలాశయంలో 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమగట్టులోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. మరో వైపు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం పరిసరాలన్నీ పర్యాటకులతో కిక్కిరిసిపోతున్నాయి. డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దాంతో ఘాట్ రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.



# ఒక రాష్ట్రంలో ప్రవహిస్తున్న 48 నదులు

## ఆ రాష్ట్రం, ఆ నదుల పేర్లు మీ కోసం

ముందడుగు ప్రత్యేకం:

మన దేశంలో 400కు పైగా చిన్న నదులు ప్రవహిస్తున్నాయి. వీటిలో ఎక్కువ భాగం గంగా, సింధు, గోదావరి, నర్మదా, బ్రహ్మపుత్ర, కృష్ణా, యమునా, తపతి వంటి నదులతో సహా 8 ప్రధాన నదులలో కనిపిస్తాయి. ఈ నదులన్నీ వ్యవసాయానికి అనుకూలమైన సారవంతమైన ఒండ్రుమట్టికి ఉత్తమ వనరు. నదులు నీటిని అందించడమే కాకుండా గృహ, పారిశ్రామిక వ్యర్థాలను, వ్యర్థ జలాలను తమ వెంట తీసుకెళ్తాయి. అయితే దేశంలో అత్యధికంగా నదులు ప్రవహించే రాష్ట్రం ఏంటో తెలుసా. దీనికి ఇప్పుడు సమాదానం తెలుసుకుందాం.

### గంగానదిలో కలుస్తాయి..

ఈ రాష్ట్రంలో 48కి పైగా నదులు ప్రవహిస్తాయి. వాటిలో ఎక్కువ భాగం గంగానదిలో కలుస్తాయి. నిజానికి ఈ ప్రశ్నకు సమాధానం చాలా మందికి తెలియదు. భారతీయ నదులను మనం కేవలం నీటి వనరులుగా చూడలేం. వాటిని ప్రాణదాత దేవుళ్ళుగా భావిస్తాము. ఇక ప్రతి నదికి పుష్కరాలు ఉంటాయి.. ఆ సమయంలో వాటిని ప్రత్యేకంగా పూజిస్తాము. ఇక ఎక్కువ నదులు ప్రవహించే రాష్ట్రం పేరు మీకు తెలుసా.. ఈ ప్రశ్నకి సమాదానం తెలియకపోతే.. మీకు మరో చిన్న క్లూ ఇస్తున్నాం. ఆ రాష్ట్రం జనాభా పరంగానే దేశంలోనే అతి పెద్దది.

### ఇతర నదులతో కలుస్తాయి

48 నదులు ప్రవహిస్తున్న రాష్ట్రం ఉత్తర ప్రదేశ్. ఇందులో ప్రధానంగా గంగా, యమునా, చంబల్, ఘఘ్రా మరియు బెత్వా నదులు ఉన్నాయి. ఇవి ప్రజల జీవనోపాధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

మనం ఉత్తర ప్రదేశ్ గుండా ప్రవహించే నదుల పేర్లను తెలుసుకుందాం. వీటిలో చాలా నదులు ఇతర నదులతో కలుస్తాయి. ఉదాహరణకు, యమునా మరియు సరస్వతి అలహాబాద్ లోని గంగా నదిలో కలుస్తాయి. అయితే సరస్వతీ నది పేరు ఈ జాబితాలో చేర్చబడలేదు, ఎందుకంటే ఇది ఇప్పుడు, ఎక్కడా కనిపించదు.

### 48 నదుల పేర్లు

ఉత్తర ప్రదేశ్‌లో బనారస్‌లో ప్రవహిస్తున్న అస్సీ నది, నేపాల్ నుంచి వచ్చే బాబాయ్ నది, బకులాహి నది, బనాస్ నది, బెలన్, బెసు, బెట్వా, భైంసాహి, భైంసాయ్, చంబల్, చోటి సరయూ, దేవ్హా, ధాసన్, జౌన్ పూర్‌లో ప్రవహిస్తున్న గంగి, గంగ, గోమతి, ఘఘ్రా, హిండన్, జామ్నీ, కాళీ , కహర్, కర్మనాసా, కథనా, కెన్.. ఉత్తరాఖండ్‌లోని కోక్రీ నది. కుక్రైల్ నదులు చేర్చబడ్డాయి. వీటితో పాటు మాగై నది, మేఘాయ్, పిరై, రామ్గంగ, రిహండ్, రోహ్నీ, సాయి నది, సరయాన్, ససుర్ ఖాదేరి, సెంగార్, శారదా, సింధ్, సోన్ రివర్, సోట్, సుహేలీ, తామ్సా, ఉల్ నది, వరుణ, వాకల్, పశ్చిమ రాప్తి మరియు యమునా నది. యూపీలో ప్రవహించే మొత్తం 48 నదులు ఇవే.


ముందడుగు
శుక్రవారం, 02-08-2024, హైదరాబాద్

# ఆ పాత్రలకు అంగీకరించను!

సినిమా పాత్రల ఎంపికలో తనకు కొన్ని పరిమితులు ఉన్నాయని చెప్పింది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. ఎంత పెద్ద సినిమాలో అవకాశం వచ్చినా సరే జుట్టు లేకుండా కనిపించే పాత్రను అస్సలు అంగీకరించనని స్పష్టం చేసింది. ఈ భామ నటించిన తాజా చిత్రం 'ఉలర్ఝ్' త్వరలో విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పాత్రలపరంగా తాను విధించుకున్న పరిమితుల గురించి వివరించింది. ఆమె మాట్లాడుతూ 'ఛాలెంజింగ్ రోల్స్ చేయడానికి సిద్ధంగా ఉన్నా. అయితే జుట్టు లేకుండా నటించడానికి అస్సలు ఇష్టపడను. 'ఉలర్ఝ్' సినిమాలో పాత్రపరంగా కొంత జుట్టు కట్ చేసుకోవాలని దర్శకుడు కోరితే సున్నితంగా తిరస్కరించా. నా తొలి చిత్రం 'ధడక్'లో జుట్టు కత్తిరించుకుంటే అమ్మ కోప్పడింది. ఎలాంటి పాత్ర చేసినా సరే, జుట్టు మాత్రం కట్ చేసుకోవద్దని సలహా ఇచ్చింది.

అమ్మకు నా జట్టు అంటే చాలా ఇష్టం. వారానికి రెండుసార్లు ఆయిల్ రాసి కేశ సంరక్షణ గురించి ఎన్నో విషయాలు చెప్పేది. అమ్మ మీద ఇష్టంతో హెయిర్ కట్ చేసుకోవద్దని నిర్ణయించుకున్నా.' అని చెప్పకొచ్చింది. ప్రస్తుతం జాన్వీకపూర్ తెలుగులో ఎన్టీఆర్, రామ్‌చరణ్ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.







# బిగ్ బాస్ హౌస్‌లోకి విష్ణు ప్రియ, రీతూ చౌదరి..?

బుల్లితెర ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తు వస్తున్న రియాల్టీ షో బిగ్ బాస్ సందడి మళ్లీ షురూ కానుంది. ఇప్పటికే ఏడు సీజన్లను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్న ఈ సెలబ్రిటీ గేమ్ షో తర్వాతి సీజన్ ను ప్రారంభించేందుకు స్టార్ మా రెడీ అవుతోంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఈ బిగ్ బాస్ 8 ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే సీజన్ 8 స్టార్ట్ కాకముందే ఈ హౌస్ లోపలికి స్టార్ కాస్ వెళ్ళబోతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరుగుతోంది. అయితే సీజన్ 8 కంటెస్టెంట్స్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సీజన్‌లో యాంకర్ విష్ణుప్రియతో పాటు నటి రీతూ చౌదరి వెళ్లనున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి ఒక ఇంటర్వ్యూలో విష్ణుప్రియ మాట్లాడుతూ.. నేను ఈ మధ్య చాలా లావు అయ్యాను. కనీసం పది కిలోలు అయిన తగ్గాలి అనుకుంటున్నాను. బిగ్ బాస్‌కి వెళితే బరువు తగ్గుతానని నమ్మకం ఉంది. అయితే నేను వెళ్తానా లేదా అనేది ప్రేక్షకుల చేతిలో ఉంది. నాకైతే బిగ్ బాస్‌కు వెళ్లడం ఇష్టం లేదు కానీ అభిమానుల వలన వెళ్తాను అని భయం వేస్తుందంటూ విష్ణుప్రియ చెప్పకొచ్చింది. ఇక రీతు చౌదరి మాట్లాడుతూ.. నేను విష్ణుప్రియలాగనే చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. కానీ నేను హౌస్‌లోకి వెళతానో లేదో చెప్పలేను. సీజన్ 8 డేట్ వచ్చే వరకు వెయిట్ చేయండి అంటూ రీతు చౌదరి తెలిపింది. ఇక వీరితో పాటు అమృత ప్రణయ్, బంచిక్ బబ్లు, యూట్యూబర్ అనిల్, యాదమ్మ రాజు, ఖయ్యూమ్ అలీ, సోనియా సింగ్ బిగ్ బాస్ సీజన్8 కంటెస్టెంట్స్‌గా ఎంపికైట్లు సమాచారం. అంతే కాకుండా మరికొందరి పేర్లు కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో ముఖ్యంగా సెలబ్రిటీల జాతకాలు చెబుతూ ఫేమస్ అయిన వేణు స్వామి, క్రికెటర్ అర్జున్, అబ్బాస్, నటుడు రోహిత్,ఇలా పలువురు పేర్లు చాలా రోజుల నుంచి వినిపిస్తున్నా దీనిపై ఎలాంటి క్లారిటీ లేదు.